# స్వర్గంలో అల్లాహ్‌ దర్శనం

## అంశం : 271

**అల్లాహ్‌ను దర్శించే సమయంలో స్వర్గవాసుల ముఖాలు సంతోషంతో వెలిగిపోతూ ఉంటాయి.**

"ఆ రోజున కొందరి ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి, తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటారు." (ఖుర్‌ఆన్, ఖియామహ్‌ : 22-23)

## అంశం : 272

**పున్నమినాటి చంద్రుని ఎంత స్పష్టంగా, సంపూర్ణంగా చూడడం జరుగుతుందో అదేరీతిలో స్వర్గంలో స్వర్గవాసులు స్పష్టంగా అల్లాహ్‌ను దర్శిస్తారు.**

"ఆ రోజున కొందరి ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి, తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటారు." (ఖుర్‌ఆన్, ఖియామహ్‌ : 22-23)

హజ్రత్‌ అబూహురైరహ్‌ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: ప్రజలు దైవప్రవక్త హజ్రత్‌ ముహమ్మద్‌ (స)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా(స)! మేము ప్రళయదినాన మా ప్రభువును చూస్తామా?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "మీకు పున్నమినాటి చంద్రుని చూడడంలో ఏమయినా కష్టం కలుగుతుందా?" ప్రజలు "ఓ దైవప్రవక్తా (స)! కష్టం కలుగదు" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త(స) తిరిగి ఈ విధంగా పలికారు: "మబ్బులు లేని సమయంలో సూర్యుని చూడడంలో మీకు ఏమయినా కష్టం కలుగుతుందా?" ప్రజలు "లేదు" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త (స) తిరిగి ఈ విధంగా పలికారు: "అదేవిధంగా (ఎటువంటి కష్టమూ లేకుండా) మీరు (ప్రళయదినాన) మీ ప్రభువును దర్శిస్తారు." (దీనిని ముస్లిమ్‌ ఉల్లేఖించారు)[1]

హజ్రత్‌ జరీర్‌ బిన్‌ అబ్దుల్లాహ్‌ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు : మేము దైవప్రవక్త హజ్రత్‌ ముహమ్మద్‌ (స) సన్నిధిలో హాజరయి ఉన్నాము. దైవప్రవక్త(స) పున్నమి నాటి చంద్రుని వైపు చూసి ఈ విధంగా పలికారు : "అతిత్వరలో మీరు మీ ప్రభువును ఈ చంద్రుని ఎటువంటి కష్టమూ లేకుండా చూసే రీతిలోనే (ఎటువంటి కష్టమూ లేకుండా) చూస్తారు." (దీనిని ముస్లిమ్‌ ఉల్లేఖించారు)[2]

హజ్రత్‌ సుహైబ్‌ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్‌ ముహమ్మద్‌(స) ఈ విధంగా పేర్కొన్నారు: స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత అల్లాహ్‌ వారిని ఉద్దేశించి ఈ విధంగా పలుకుతాడు: "మీకు ఇంకా ఏమయినా కావాలా?"

అప్పుడు స్వర్గవాసులు ఈ విధంగా పేర్కొంటారు: "ఓ అల్లాహ్! నీవు మా ముఖాలను కాంతిమయం కావించలేదా? నీవు మమ్మల్ని స్వర్గంలోకి ప్రవేశింప జేయలేదా? నీవు మాకు నరకాగ్ని నుంచి విముక్తిని ప్రసాదించలేదా? (ఇంకా ఏం కావాలి?)" అప్పుడు అకస్మాత్తుగా (అల్లాహ్‌కు, స్వర్గవాసులకు నడుమ ఉన్న) పరదా తొలగిపోతుంది. అప్పుడు స్వర్గవాసులకు తమకు స్వర్గంలో ప్రసాదించబడిన ప్రతి వస్తువు కంటే తమ ప్రభువు వైపు చూడడం ఎంతో ప్రియమైనదయిపోతుంది. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[3]

## అంశం : 273

### ఇహలోకంలో అల్లాహ్‌ను దర్శించడం సాధ్యం కాదు.

హజ్రత్ అబూజర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాను: "మీరు మీ ప్రభువును దర్శించారా?" దైవప్రవక్త (స) ఈ విధంగా బదులిచ్చారు: "అల్లాహ్ కాంతి స్వరూపుడు. నేను ఆయనను ఎలా దర్శించగలను?" (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

హజ్రత్ అబ్దుల్లాహ్ (బిన్ మస్ఊద్) (ర) అల్లాహ్ పలికిన వాక్యం 'మా కజబల్ ఫువాదు మా రఆ' (కళ్ళు చూసిన దానిలో హృదయం అసత్యాన్ని కలుపలేదు) (ఖుర్ఆన్, నజ్మ్ :11) గురించి వ్యాఖ్యానిస్తూ "ఇక్కడ చూడడమంటే దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ)ను చూడడమని భావం. దైవదూత 600 రెక్కలను కలిగి ఉండటాన్ని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) చూశారు." అని పేర్కొన్నారు.

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[5]

హజ్రత్ అబూహురైరహ్ (ర) అల్లాహ్ పలికిన వాక్యం 'లఖద్ రఆహు నజ్‌లతన్ ఉఖ్‌రా' (మరొక పర్యాయం ముహమ్మద్ (స) ఆయనను సిద్రతుల్ మున్‌తహా సమీపంలో దిగుతుండగా చూశారు) (ఖుర్ఆన్, నజ్మ్ :13) గురించి వ్యాఖ్యానిస్తూ "హజ్రత్ ముహమ్మద్ (స) రెండవ పర్యాయం దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) ను చూశారు" అని పేర్కొన్నారు. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[6]

## అంశం : 274

### ప్రళయదినాన అల్లాహ్ దర్శనం పొందేందుకు దోహదపడే దుఆ (ప్రార్థన):

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) (నమాజ్ లో దురూదె షరీఫ్ తర్వాత) ఈ విధంగా ప్రార్థించేవారు:

**"అల్లాహుమ్మ బి ఇల్‌మికల్ గైబి వ ఖుద్‌రతిక అలల్ ఖల్‌ఖి అహ్‌యినీ మా అలిమ్‌తల్ హయాత ఖైరల్లీ వ తవఫ్ఫనీ ఇజా అలిమ్‌తల్ వఫాత ఖైరల్లీ వ అస్అలుక ఖష్‌యతక ఫిల్ గైబి వష్షహాదతి వ కలిమతిల్ ఇఖ్‌లాసి**

**ఫిర్రజా వల్ గజబి వ అస్అలుక నఈమల్లా యన్ఫదు వ ఖుర్రత ఐనిల్లా తన్ఖతిఉ వ అస్అలుకర్రిజాఅ బిల్ ఖజాఇ వ బర్దల్ ఐషి బఅదల్ మౌతి వ లజ్జతన్నజ్రి ఇలా వజ్హిక వష్ షౌఖ ఇలా లిఖాఇక వ అఊజుబిక మిన్ జర్రాఅ ముజిర్రతిఁవ్వ ఫిత్నతిమ్ ముజిల్లతిన్ అల్లాహుమ్మ రబ్బనా బిజీనతిల్ ఈమాని వజ్అల్నా హదాతమ్ ముహ్తదీన్"**

"ఓ అల్లాహ్! నేను నీ అగోచర జ్ఞానం మరియు జీవరాశులపై నీ అధికారం మాధ్యమంగా అర్థిస్తున్నాను: నీ జ్ఞానం ప్రకారం నా జీవితం నా కొరకు మేలైనదిగా ఉండేంతవరకు నీవు నన్ను సజీవంగా ఉంచు. అలాగే నీ జ్ఞానం ప్రకారం నా మరణం నా కొరకు మేలైనదిగా అయినప్పుడు నాకు మరణాన్ని ప్రసాదించు. ఓ అల్లాహ్! ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ (ప్రతి సమయం, ప్రతి చోటా) నీకు భయపడే విధంగా సద్బుద్ధిని నాకు ప్రసాదించమని కోరుతున్నాను. అలాగే సంతోషంలోనూ, దుఃఖంలోనూ (అన్ని పరిస్థితుల్లోనూ) సత్యం పలికే విధంగా సద్బుద్ధిని ప్రసాదించమని నిన్ను అర్థిస్తున్నాను. అలాగే కలిమిలోనూ, లేమిలోనూ మధ్యేమార్గాన్ని అవలంబించే సద్బుద్ధిని ప్రసాదించమని నిన్ను అభ్యర్థిస్తున్నాను. అలాగే ఎన్నటికీ అంతరించని సౌఖ్యాన్ని ప్రసాదించవలసిందిగా నిన్ను అర్థిస్తున్నాను. నిత్యం కొనసాగే చల్లదనాన్ని కనులకు ప్రసాదించమని అర్థిస్తున్నాను. అలాగే నీ యొక్క ప్రతి తీర్పు పట్లా సంతుష్టుడినయ్యే సద్బుద్ధిని ప్రసాదించమని అర్థిస్తున్నాను. అలాగే మరణించిన తర్వాత సుఖవంతమైన జీవితాన్ని అర్థిస్తున్నాను. అలాగే నీ పవిత్రమైన అస్తిత్వాన్ని దర్శించే సౌభాగ్యాన్ని అర్థిస్తున్నాను. నిన్ను కలుసుకోవడం పట్ల ఆసక్తిని అభ్యర్థిస్తున్నాను. (నా ఇహపరాలకు) నష్టాన్ని కలిగించే కష్టం నుంచి రక్షణ పొందేందుకై నీ శరణు వేడుకుంటున్నాను. అలాగే సన్మార్గం నుంచి తప్పించే ఉపద్రవం నుంచి రక్షణ పొందేందుకై నీ శరణు వేడుకుంటున్నాను. ఓ అల్లాహ్! మమ్మల్ని విశ్వాసపు సౌందర్యంతో అలంకరించు. అలాగే మమ్మల్ని సన్మార్గం పొందినవారికి మార్గదర్శులుగా చేయి."

(దీనిని నసాయీ ఉల్లేఖించారు)[7]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాత్ రూయతుల్ ముఅ్మినీన్ ఫిల్ ఆఖిరతి రబ్బిహిమ్ సుబ్హానహూ వ తఆలా
2. కితాబుల్ మసాజిద్ వ మవాజిఉస్సలాహ్, బాబ్ ఫజ్లి సలాతిస్సుబహ్ వల్ అస్ర్
3. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాత్ రూయతుల్ ముఅ్మినీన ఫిల్ ఆఖిరతి రబ్బిహిమ్ సుబ్హానహూ వ తఆలా
4. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
5. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
6. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
7. కితాబుస్సలాహ్, బాబుజ్జిక్ర్ బఅదుత్తషహ్హుద్